Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
01-04-2026
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 94 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD బుధవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## గణపతి సంచలన డిమాండ్లు

మావోయిస్టు అగ్రనేత గణపతి పలు డిమాండ్లను కేంద్రం ముందు ఉంచినట్లు తెలుస్తోంది. దండకారణ్యం నుండి భద్రత బలగాలను ఎత్తి వేయాలని, పోలీస్ బేస్ క్యాంపులను ఎత్తివేయాలని, ఏళ్ల తరబడి కేంద్ర కారాగారాల్లో మగ్గుతున్న మావోయిస్టు రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని వారిపై ఉన్నటువంటి కేసులను ఎత్తివేయవలసిందిగా కేంద్రం ముందు గణపతి డిమాండ్లను ఉంచినట్లు తెలుస్తోంది. ఆదివాసి ఖైదీలను కూడా విడుదల చేయాలని కోరినట్లు తెలుస్తుంది.. మార్చి 31 తో దేశంలో నక్సల్ ఉద్యమం దాదాపు ముగిసినట్లేనని కేంద్రం భావిస్తోంది. అయితే ఇంకా కొందరు అగ్రనేతల ఆచూకి లభించాల్సి ఉంది.

పూర్తి కథనం 4లో

టాప్ న్యూస్

### కేరళకు సీఎం రేవంత్‌రెడ్డి

- నేడు ఎన్నికల ప్రచారం
- మంత్రులు కూడా కేరళలోనే...



02

### నిబంధనలకు విరుద్ధంగా శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి

- ఏపీ సర్కార్ పై మంత్రి జూపల్లి ధ్వజం



02

### వడగళ్ళ వాన గండం

- తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు
- పలు జిల్లాలకు 'ఆరెంజ్' హెచ్చరిక



02

# మిషన్ కంప్లీట్

## నక్సల్స్ రహిత భారతం



**మహా నెట్ వర్క్:** నక్సల్ ఫ్రీ ఇండియా నినాదం సాకారమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన నక్సలిజం చరిత్రలో కలిసిపోయింది. నక్సల్ రహిత భారత్ లక్ష్యంగా కేంద్ర చేపట్టిన మిషన్‌తో మావోయిస్టు తిరుగుబాటుకు తెరపడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1980వ దశకంలో మావోయిస్టులపై పోలీసుల ఒత్తిడి, నిర్బంధం పెరిగాయి. దీంతో వారు పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ దండకారణ్యాలను సురక్షిత షెల్టర్ జోన్‌లుగా మార్చుకున్నారు. నాటి నుంచి నేటివరకు దాదాపు 45 ఏళ్ల పాటు అక్కడి నుంచే కార్యకలాపాలను కొనసాగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మిషన్‌ల ఫలితంగా ఎట్టకేలకు ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యాలు వేదికగా మావోయిస్టుల కార్యకలాపాలకు తెరపడింది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిజాన్ని నిర్మూలిస్తామని 2024లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ ప్రకటనకు అనుగుణంగా సరిగ్గా 2026 మార్చి 31వ తేదీకి ఒక రోజు ముందు కీలక ప్రకటన విడుదలైంది. మంగళవారం అక్కడక్కడా మిగిలిన వారిలో 34మంది లొంగిపోయారు. ఇంకా తెలంగాణ నుండి గణపతితో సహా ఏడుగురు అగ్రనేతలు అజ్ఞాతంలో ఉన్నారు. అనేక ఎన్ కౌంటర్లు, మందుపాతర్లు, క్లైమోర్ మైన్స్, దాడులు, పేల్చివేతలు.. ఒక రకమైన రక్తచరిత్ర, ఒక ప్రాంతంలో.. ఒక దశలో సాగిన సమాంతర పాలన.. చరిత్రకు జ్ఞాపకాలు మిగిల్చి నక్సల్స్ లొంగిపోవడమో.. జరిగిపోవడమో కేంద్రానికి తలవంచారు. ఆపరేషన్ కగార్ లక్ష్యాన్ని ప్రకటించి.. ఆయుధాలతో ఎవరున్నా సహించబోమని తేల్చిచెప్పిన కేంద్రం అనుకున్న లక్ష్యాన్ని సాధించింది.

### ఛత్తీస్‌గఢ్‌లో 34 మంది లొంగుబాటు

2లో

- ముగిసిన 'ఆపరేషన్ కగార్'
- భారీగా ఆయుధాలు, కిలోల కొద్దీ బంగారం, కోట్లాది నగదు స్వాధీనం

## అమరావతికి చట్టబద్ధ ముద్ర

### లోక్‌సభలో నేడు విభజన చట్ట సవరణ బిల్లు

### ఏపీ ఏకైక రాజధానిగా అధికారిక గుర్తింపు





**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి తిరుగులేని చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక అడుగు వేయనుంది. విభజన జరిగిన పుష్కర కాలం తర్వాత, ఏపీ రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చట్టంలో చేర్చేందుకు వీలుగా 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు 2026'ను కేంద్రం సిద్ధం చేసింది. ఈ కీలక బిల్లును బుధవారం (ఏప్రిల్ 1) లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. దశాబ్ద కాలంగా రాజధాని విషయంలో కొనసాగుతున్న న్యాయ, రాజకీయ సందిగ్ధతకు ఈ సవరణతో శాశ్వతంగా తెరపడనుంది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని ఏకైక రాజధానిగా నిర్మించేందుకు చేపట్టిన ప్రయత్నాలకు కేంద్రం నుంచి ఈ రూపంలో గట్టి మద్దతు లభించినట్లయింది.

మిగతా 2లో

### నిబంధనలకు విరుద్ధంగా

## శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి

### ఏపీ సర్కార్ పై మంత్రి జూపల్లి ధ్వజం



**హైదరాబాద్, మహా :** శ్రీశైలం జలాశయం నీటి వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, తెలంగాణ ప్రయోజనాలను కాలరాస్తూ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు డా. చిక్కుడు వంశీకృష్ణ, డా. రాజేష్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, శ్రీశైలం రిజర్వాయర్‌లో కనిష్ట

మిగతా 2లో

### ప్రజాపాలన ప్రతిబింబించేలా

## గ్రామసభలు నిర్వహించాలి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణకు కసరత్తు

### కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో దిశానిర్దేశం



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గడపకూ చేరేలా, 'ప్రజాపాలన' స్ఫూర్తి ప్రతిబింబించేలా గ్రామసభలను నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల

మిగతా 2లో

### సొంతింటి కలపై

## 'సిమెంట్' పిడుగు

### *సామాన్యుడిపై రోజుకు రూ.10 కోట్ల భారం!*

### సిండికేట్ కోరల్లో గృహ నిర్మాణం.. బస్తాపై రూ.50 వరకు బాదుడు

### నేటి నుంచే అమల్లోకి పెంపు.. పాత ధరల బుకింగ్‌లకు కంపెనీల బ్రేక్

### బెంబేలెత్తుతున్న మధ్యతరగతి జీవి.. రియల్ ఎస్టేట్ రంగంలో అగ్గిరాజేసిన ధరల సెగ



**హైదరాబాద్, మహా:** సొంత గూడు నిర్మించుకోవాలనే సామాన్యుడి ఆశలపై సిమెంట్ కంపెనీలు నీళ్లు చల్లాయి. ఇప్పటికే ఇసుక కొరత, ఇటుకల ధరలు, పెరిగిన కూలీల రేట్లతో సతమతమవుతున్న సామాన్యుడిపై ఇప్పుడు సిమెంట్ పిడుగు పడింది. దేశవ్యాప్తంగా సిమెంట్ కంపెనీలన్నీ ఏకమై ఏప్రిల్ 1వ తేదీ నుంచి బస్తాపై రూ.30 నుంచి రూ.50 వరకు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం నిర్మాణ రంగంలో పెను సంచలనం సృష్టిస్తోంది.

మిగతా 2లో



తెలుగు

# మహా పత్రిక

02

బుధవారం, తిరుపతి | 01-04-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

## నిబంధనలకు విరుద్ధంగా
# శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి

**ఏపీ సర్కార్ పై మంత్రి జూపల్లి ధ్వజం**

**హైదరాబాద్, మహా :** శ్రీశైలం జలాశయం నీటి వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, తెలంగాణ ప్రయోజనాలను కాలరాస్తూ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు డా. చిక్కుడు వంశీకృష్ణ, డా. రాజేష్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, శ్రీశైలం రిజర్వాయర్‌లో కనిష్ట నీటి మట్టం స్థాయి 834 అడుగుల (254.2 మీటర్లు) కు చేరుకున్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేపట్టకూడదనే స్పష్టమైన నిబంధనలున్నాయని జూపల్లి గుర్తు చేశారు. ఈ నిబంధనలను తుంగలో తొక్కి, తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏపీ సర్కార్ అన్యాయంగా నీటిని తోడేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా ఏపీ ప్రభుత్వం తన మొండివైఖరిని వీడలేదు అని ఆయన ధ్వజమెత్తారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగం, కృష్ణా పరివాహక ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులమంతా ఏకమై శ్రీశైలం వద్ద 'వంటావార్పు' కార్యక్రమానికి పిలుపునిచ్చామని, మా హెచ్చరికల తీవ్రతను గమనించిన తర్వాతే ఏపీ ప్రభుత్వం దిగివచ్చి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసింది అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జూపల్లి పునరుద్ఘాటించారు. పాలమూరు జిల్లాకు అన్యాయం జరిగితే రైతు పక్షాన నిలబడి ప్రభుత్వం పోరాడుతుంది. ఏపీ ప్రభుత్వం భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి వాటాల అంశంలో తెలంగాణ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు గతంలోనూ తాము ఆందోళనలు చేశామని, హైకోర్టును ఆశ్రయించామని ఆయన గుర్తుచేశారు. అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడైనా మా రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యమని, నీటి కేటాయింపుల విషయంలో ఎవరితోనూ రాజీపడబోమన్నారు.

# సొంతింటి కలపై సిమెంట్ పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

మార్చి 31వ తేదీ సాయంత్రం నుంచే కొత్త బుకింగ్‌లను నిలిపివేసిన కంపెనీలు, పాత ధరలతో ఆర్డర్లు తీసుకోబోమని డీలర్లకు తెగేసి చెప్పేశాయి. దీంతో నిన్నటి వరకు రూ.320 పలికిన సిమెంట్ బస్తా ధర, నేటి నుంచి మార్కెట్‌లో రూ.370 మార్కును దాటనుంది. ఈ ధరల పెంపుతో రాష్ట్రవ్యాప్తంగా సామాన్య వినియోగదారులపై రోజుకు సుమారు రూ.10 కోట్ల అదనపు భారం పడనుండటం గమనార్హం.

రాష్ట్రవ్యాప్తంగా సిమెంట్ వినియోగాన్ని పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. గృహ నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాజెక్టులు, వాణిజ్య సముదాయాల కోసం రాష్ట్రంలో రోజుకు సగటున 20 లక్షల సిమెంట్ బస్తాల విక్రయాలు జరుగుతున్నాయి. బస్తాపై రూ.50 పెరిగిన లెక్కన చూస్తే, కేవలం ఒక్క రోజులోనే ప్రజల జేబుల నుంచి రూ.10 కోట్ల అదనపు సొమ్ము కంపెనీల ఖజానాకు చేరనుంది. ఈ లెక్కన నెలకు దాదాపు రూ.300 కోట్ల మేర భారం సామాన్యుడిపై పడనుంది. జిల్లాల వారీగా విశ్లేషిస్తే, అత్యధికంగా గృహ నిర్మాణాలు జరుగుతున్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లోనే సిమెంట్ వినియోగం సింహభాగం ఉంటోంది. ఈ మూడు జిల్లాల్లోనే రోజుకు సుమారు 8 నుంచి 10 లక్షల బస్తాల వరకు ఖర్చవుతుండగా, ఆ తర్వాతి స్థానాల్లో అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న నిర్మాణ రంగంపై ఈ పెంపు తీవ్ర ప్రభావం చూపనుంది.

సిమెంట్ కంపెనీల వ్యూహం కూడా వివాదాస్పదంగా మారింది. ధరలు పెరుగుతున్నాయని ముందే సమాచారం ఉండటంతో చాలామంది లబ్ధిదారులు మార్చి 30, 31 తేదీల్లో భారీగా స్టాక్ బుక్ చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే, కంపెనీలు సాఫ్ట్‌వేర్‌లో కొత్త బుకింగ్‌లను బ్లాక్ చేయడంతో పాటు, డీలర్ల వద్ద ఉన్న స్టాక్‌ను కూడా పాత ధరలకు విక్రయించవద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేశాయి. దీనివల్ల పాత ధరలతో ఇల్లు పూర్తి చేద్దామనుకున్న మధ్యతరగతి ప్రజలకు నిరాశే ఎదురైంది. రవాణా ఖర్చులు, బొగ్గు ధరలు పెరిగాయనే నెపంతో కంపెనీలు ఈ బాదుడుకు దిగాయని విశ్లేషకులు చెబుతున్నా, ఇది కృత్రిమంగా సృష్టించిన సిండికేట్ ధరల పెరుగుదలేనని రియల్ ఎస్టేట్ అసోసియేషన్లు మండిపడుతున్నాయి. ఇప్పటికే స్లాబుల వరకు వచ్చిన ఇళ్లు, ప్లాస్టరింగ్ దశలో ఉన్న నిర్మాణాలకు ఈ అదనపు ఖర్చు పెను భారంగా మారనుంది. వేలల్లో పెరిగే ఈ ఖర్చు సామాన్యుడి బడ్జెట్‌ను తలకిందులు చేయనుంది. ఈ ధరల పెంపు ప్రభావం కేవలం సిమెంట్‌కే పరిమితం కాకుండా గొలుసుకట్టు చర్యలా మారే ప్రమాదం ఉంది. సిమెంట్ ధర పెరగడంతో కంక్రీట్ మిశ్రమాలు, సిమెంట్ ఇటుకలు, ఇతర నిర్మాణ సామాగ్రి ధరలు కూడా ఆటోమేటిక్‌గా పెరగనున్నాయి. అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారికి కూడా బిల్డర్లు అదనపు భారం వేసే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, ప్రభుత్వ కాంట్రాక్టులు చేస్తున్న చిన్న చిన్న కాంట్రాక్టర్లు కూడా పెరిగిన ధరల వల్ల పనులు మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో నెలకొన్న ఈ అనిశ్చితి వల్ల గృహ నిర్మాణ రంగం కుదేలయ్యే అవకాశం ఉందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సిమెంట్ కంపెనీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే సొంతింటి కల కేవలం కలే మిగిలిపోతుందని వేలాది మంది లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా
శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి
ఏపీ సర్కార్ పై మంత్రి జూపల్లి ధ్వజం
(మొదటిపేజీ తరువాయి)
నీటి మట్టం స్థాయి 834 అడుగుల (254.2 మీటర్లు) కు చేరుకున్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేపట్టకూడదనే స్పష్టమైన నిబంధనలున్నాయని జూపల్లి గుర్తు చేశారు. ఈ నిబంధనలను తుంగలో తొక్కి, తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏపీ సర్కార్ అన్యాయంగా నీటిని తోడేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా ఏపీ ప్రభుత్వం తన మొండివైఖరిని వీడలేదు అని ఆయన ధ్వజమెత్తారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగం, కృష్ణా పరివాహక ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులమంతా ఏకమై శ్రీశైలం వద్ద 'వంటావార్పు' కార్యక్రమానికి పిలుపునిచ్చామని, మా హెచ్చరికల తీవ్రతను గమనించిన తర్వాతే ఏపీ ప్రభుత్వం దిగివచ్చి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసింది అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జూపల్లి పునరుద్ఘాటించారు. పాలమూరు జిల్లాకు అన్యాయం జరిగితే రైతు పక్షాన నిలబడి ప్రభుత్వం పోరాడుతుంది. ఏపీ ప్రభుత్వం భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి వాటాల అంశంలో తెలంగాణ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు గతంలోనూ తాము ఆందోళనలు చేశామని, హైకోర్టును ఆశ్రయించామని ఆయన గుర్తుచేశారు. అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడైనా మా రాష్ట్రప్రయోజనాలే మాకు ముఖ్యమని, నీటి కేటాయింపుల విషయంలో ఎవరితోనూ రాజీపడబోమన్నారు.

# వడగళ్ల వాన గండం

**తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షా లు**

**పలు జిల్లాలకు 'ఆరెంజ్' హెచ్చరిక**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానలు పడే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఈరోజు, రేపు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో వడగళ్ల వానతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రేపు ప్రత్యేకంగా కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వర్షం తీవ్రత అధికంగా ఉంటుందని, ఈ మేరకు ఆయా జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నగరంపై ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. నగరంలో అక్కడక్కడా ఈదురు గాలుల ప్రభావం ఉండొచ్చని, అకస్మాత్తుగా కురిసే వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండరాదని హెచ్చరికలు జారీ చేసింది.



# మిత్రదేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక

- 'మీ చమురు మీరే తెచ్చుకోండి!'
- ఇరాన్‌పై చర్యల్లో సహకరించని దేశాలపై ఆగ్రహం
- 'ట్రూత్ సోషల్'లో అమెరికా అధ్యక్షుడి సంచలన పోస్ట్

**వాషింగ్టన్, మహా:** మిత్రదేశాల తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే స్వయంగా సమకూర్చుకోవాలని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సొంత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో పెట్టిన పోస్టు ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా బ్రిటన్ వంటి దేశాలను ఉద్దేశించి ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన దేశాలకు కేవలం రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా వద్ద పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయడం ఒకటవ మార్గం కాగా, కాస్త ధైర్యం తెచ్చుకుని నేరుగా హర్మూజ్ జలసంధికి వెళ్లి తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవడం రెండో మార్గమని ఆయన ఎద్దేవా చేశారు. మిత్రదేశాలు ఇకనైనా తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. తమకు అవసరమైనప్పుడు దూరంగా ఉన్న దేశాలకు అమెరికా కూడా భవిష్యత్తులో సాయం చేసే ప్రసక్తే లేదని ట్రంప్ తేల్చిచెప్పారు. "ఇరాన్‌ను మేము ఇప్పటికే గట్టిగా దెబ్బతీశాం, అత్యంత కష్టమైన పని పూర్తయింది. ఇకపై మీ రక్షణ, మీ చమురు అవసరాలు మీరే చూసుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినప్పటికీ, కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును ఇంకా కొనసాగిస్తూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు ఈ జలసంధి గుండానే రవాణా అవుతుండటంతో, ఇరాన్ విధిస్తున్న దిగ్బంధనం అంతర్జాతీయ మార్కెట్లను వణికిస్తోంది. చమురు ధరలు విపరీతంగా పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుదేలవడమే కాకుండా, సామాన్యుడిపై నిత్యావసరాల ధరల భారం పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మిత్రదేశాల మధ్య సంబంధాలను మరింత ఉద్రిక్తంగా మార్చేలా కనిపిస్తున్నాయి.

# ఛత్తీస్‌గఢ్‌లో 34 మంది లొంగుబాటు

**రాయ్‌పూర్, మహా:** ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మావోయిస్టుల ప్రాబల్యానికి గట్టి దెబ్బ తగిలింది. ప్రధాన స్రవంతిలో కలవాలన్న ప్రభుత్వ పిలుపునకు స్పందిస్తూ మంగళవారం ఏకంగా 34 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామంతో అటవీ ప్రాంతాల్లో విప్లవ ముఠాల కార్యకలాపాలకు పెద్ద విఘాతం కలిగింది. లొంగిపోయిన వారిలో పలువురు కీలక కేడర్‌కు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. వీరి నుంచి సేకరించిన సమాచారం మేరకు మావోయిస్టులు దాచిన భారీ ఆయుధ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో దిగ్భ్రాంతి కలిగించే స్థాయిలో సంపద, మందుగుండు సామగ్రి బయటపడింది. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 93 అత్యాధునిక ఆయుధాలతో పాటు సుమారు ఏడు కిలోల బంగారం, రెండు కోట్ల తొంభై లక్షల రూపాయల నగదు ఉన్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. మావోయిస్టులకు ఆర్థికంగా, సైనికపరంగా ఇది కోలుకోలేని దెబ్బ అని భద్రతా బలగాలు విశ్లేషిస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో రహస్యంగా నిల్వ ఉంచిన ఈ సొత్తును పోలీసులు అత్యంత చాకచక్యంగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అడవుల్లో తిష్టవేసిన ఉగ్రవాద శక్తులను ఏరివేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' నేటితో ముగిసింది. ఈ ప్రత్యేక ఆపరేషన్ ముగింపు రోజైన మంగళవారమే ఇంత భారీ స్థాయిలో లొంగుబాటు జరగడం విశేషం. మావోయిస్టుల కదలికలను పూర్తిగా అరికట్టేందుకు, వారి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు 'ఆపరేషన్ కగార్' ద్వారా భద్రతా బలగాలు నిరంతర సోదాలు నిర్వహించాయి. ఈ ఆపరేషన్ వల్ల మావోయిస్టుల బలం గణనీయంగా తగ్గిందని, అడవి బాటను వీడి ప్రజాస్వామ్య మార్గంలోకి వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని పోలీసులు పేర్కొన్నారు. లొంగిపోయిన 34 మందికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరావాస ప్యాకేజీలు అందజేస్తామని, ఇప్పటికైనా మిగిలిన వారు ఆయుధాలను వీడి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని పోలీసు యంత్రాంగం పిలుపునిచ్చింది. ఈ భారీ స్వాధీనం నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.



# కేరళకు సీఎం రేవంత్‌రెడ్డి

**నేడు ఎన్నికల ప్రచారం**
**మంత్రులు కూడా కేరళలోనే**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచార బరిలోకి దిగుతున్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించే బాధ్యతను రేవంత్ రెడ్డి భుజానికెత్తుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లగా, బుధవారం ప్రచారంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ప్రకారం, బుధవారం కేరళలోని పలు నియోజకవర్గాల్లో నిర్వహించే ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. బహిరంగ సభలు, రోడ్ షోల ద్వారా కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల విజయం కోసం ఆయన ఓటర్లను అభ్యర్థించనున్నారు. వాస్తవానికి రేవంత్ రెడ్డి గత వారమే కేరళలో పర్యటించాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని అత్యవసర పాలనా వ్యవహారాలు, ఇతర రాజకీయ పరిణామాల వల్ల ఆ పర్యటన అనివార్యంగా వాయిదా పడింది. తాజాగా పరిస్థితులు అనుకూలించడంతో ఆయన కేరళ ఎన్నికల రణక్షేత్రంలో అడుగుపెట్టనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించిన తీరును, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేరళ ఓటర్లకు వివరిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా ఆయన ప్రసంగాలు సాగనున్నాయి.

**మంత్రులు కూడా కేరాఫ్ కేరళ**

మంత్రులు శ్రీధర్ బాబు కేరళ ప్రచారంలో మంగళవారం పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా బుధవారం కేరళ వెళ్ళి రెండు లేదా మూడురోజులు ప్రచారంలో పాల్గొంటారు. రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేరళలో రాహుల్ సభల్లో పాల్గొన్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తో పాటు పలువురు నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. సీతక్క కూడా కేరళ ప్రచారానికి వెళ్ళనున్నారు.

# మహిళల పట్ల వెకిలి చేష్టలు సహించేది లేదు

- మహాలక్ష్మి పథకంతో రూ.10 వేల కోట్ల పొదుపు
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- 10 కోట్ల ప్రయాణాల మైలురాయిపై ఘనంగా వేడుకలు



**హైదరాబాద్, మహా:** మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంటే, కొందరు విమర్శల పేరుతో వారిని అవమానించడం శోచనీయమని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు చెడిపోతున్నారంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఆడబిడ్డల పట్ల వెకిలిగా మాట్లాడే వారికి తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణాలు 10 కోట్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే అత్యధికం అమలు చేసిందని, పెండింగ్‌లో ఉన్న ఒక్క హామీని కూడా అతి త్వరలోనే నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణమే కాదని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఇప్పటివరకు దాదాపు 10 వేల కోట్ల రూపాయల మేర ఆర్థికంగా పొదుపు అయిందని వివరించారు. కేవలం ప్రయాణాలకే పరిమితం కాకుండా, మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, వారి భాగస్వామ్యంతో రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య 10 కోట్లు దాటడం పథకం విజయానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మహిళా ప్రయాణికుల కోసం మరిన్ని సౌకర్యాలు మెరుగుపరుస్తామని, ఆర్టీసీని బలోపేతం చేస్తూనే మహిళలకు భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొని, పథకం సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేశారు. 10 కోట్ల ప్రయాణాల మైలురాయిని చేరుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

## ప్రజాపాలన ప్రతిబింబించేలా
# గ్రామసభలు నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లపై మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే గ్రామసభలు ఒకే రీతిన ఉండేలా చూడాలని, వార్డు సభ్యుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేల వరకు ప్రజాప్రతినిధులందరినీ ఈ సభలకు ఆహ్వానించాలని సూచించారు. గ్రామసభల్లో ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించడంతో పాటు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను బహిరంగంగా వెల్లడించాలన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపుసెట్ల వంటి పథకాల లబ్ధిదారులతో సభలో మాట్లాడించి, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వస్తున్న స్పందనను (ఫీడ్ బ్యాక్) విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. జూన్ 2 నుంచి ప్రారంభం కానున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, పాలు, రాగి జావ పంపిణీ వంటి భవిష్యత్ కార్యక్రమాలపై కూడా గ్రామసభల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంపై స్పష్టత ఇవ్వాలని, సాంస్కృతిక శాఖ కళాకారుల ద్వారా ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన భారీ నిధులను సద్వినియోగం చేస్తూ, ప్రగతి ప్రణాళికను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ.. గత మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, పారిశుద్ధ్య కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, అదే ఉత్సాహంతో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని, బడ్జెట్‌లో ప్రతిపాదించిన నూతన పథకాల మార్గదర్శకాలను సభల్లో వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభల తరహాలోనే మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని, వీటిపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలు అందించాలని కలెక్టర్లకు సూచించారు.

## అమరావతికి
# చట్టబద్ధ ముద్ర

(మొదటిపేజీ తరువాయి)

ఈ సవరణ బిల్లు ద్వారా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5, సబ్‌సెక్షన్ (2)లో భారీ మార్పులు చేయనున్నారు. ప్రస్తుతం చట్టంలో ఉన్న 'రాష్ట్రానికి ఒక కొత్త రాజధాని ఉంటుంది' అనే సాధారణ వాక్యం స్థానంలో, ఇకపై 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' అని స్పష్టంగా పొందుపరచనున్నారు. కేవలం పేరును చేర్చడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (APCRDA) చట్టం 2014 ప్రకారం నోటిఫై చేసిన ప్రాంతాలన్నీ అమరావతి పరిధిలోకి వస్తాయని బిల్లులో వివరించారు. దీనివల్ల రాజధాని విస్తీర్ణం, పరిధిపై భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు తావులేకుండా చట్టపరమైన రక్షణ లభించనుంది. ఈ బిల్లులోని మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ఈ సవరణను గతకాలం నుంచి అంటే జూన్ 2, 2024 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించనున్నారు. అంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే అమరావతి అధికారిక రాజధానిగా గుర్తింపు పొందినట్లు అవుతుంది. ఇటీవలే మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రత్యేకంగా సమావేశమై, పునర్విభజన చట్టాన్ని సవరించి అమరావతి పేరును చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. 2022 మార్చిలో హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ మార్పులు చేయాలని రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ తీర్మాన ప్రతిని కేంద్ర హోంశాఖకు, పార్లమెంటు ఉభయ సభల అధ్యక్షులకు పంపగా, కేంద్రం వెనువెంటనే స్పందించి ఈ బిల్లును రూపొందించింది. అమరావతిని రాజధానిగా చట్టంలో చేర్చడం ద్వారా ఇటు కేంద్రం, అటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు వీలు కలుగుతుంది. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపులు, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల నుంచి వచ్చే రుణాలకు ఈ చట్టబద్ధత ఎంతో కీలకం కానుంది. గత ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో నెలకొన్న అనిశ్చితి వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతినడమే కాకుండా పెట్టుబడులు కూడా వెనక్కి వెళ్లాయి. ఇప్పుడు కేంద్రమే నేరుగా చట్ట సవరణకు మొగ్గు చూపడంతో అమరావతికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడమే కాకుండా, భూములిచ్చిన రైతులకు కూడా భరోసా లభించినట్లయింది. రేపు లోక్‌సభలో ఈ బిల్లు ప్రవేశపెట్టడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరో కీలక ఘట్టంగా నిలిచిపోనుంది.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



- శ్రీవారి హుండీకి రూ. 5.08 కోట్ల ఆదాయం
- నిన్న 70 వేల మందికి పైగా దర్శనం
- సర్వదర్శనానికి 12 గంటల సమయం

**తిరుమల, మహా:** కలియుగ వైకుంఠనాథుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారి క్షేత్రంలో భక్తుల సందడి ఓ మోస్తరుగా కొనసాగుతోంది. సోమవారం (మార్చి 30) ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం భారీగా సమకూరింది. భక్తులు తమ మొక్కుల రూపంలో సమర్పించుకున్న కానుకల ద్వారా స్వామివారికి రూ. 5.08 కోట్ల ఆదాయం లభించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. నిన్న ఒక్కరోజే మొత్తం 70,044 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. తమ మొక్కులు చెల్లించుకునే క్రమంలో భాగంగా 27,241 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ప్రస్తుతం తిరుమలలో భక్తుల తాకిడి కారణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 20 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనం లభించేందుకు సుమారు 8 నుంచి 12 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో వేచి ఉన్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, అన్నప్రసాదం, పాలు పంపిణీ చేస్తూ దర్శన ఏర్పాట్లను అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

# హుస్సేన్ సాగర్ 'ప్రాణదాత' శివకు ముఖ్యమంత్రి భారీ సాయం

**రూ. 5 లక్షల ఆర్థిక సాయం.. కుమారుడికి హోంగార్డు ఉద్యోగం.. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు**

**హైదరాబాద్, మహా:** హుస్సేన్ సాగర్ (ట్యాంక్‌బండ్) లో ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాలతో పడిపోయిన వందలాది మంది ప్రాణాలను కాపాడి 'ప్రాణదాత'గా గుర్తింపు పొందిన శివకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. నిస్వార్థంగా ఎంతో మంది ప్రాణాలను కాపాడినప్పటికీ, ప్రస్తుతం కుటుంబ పోషణ భారమై శివ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న వార్తలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు మానవీయ కోణంలో స్పందించారు. మంగళవారం హైదరాబాద్‌లో శివ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రిని కలుసుకోగా, వారికి ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కేవలం ఆర్థిక సాయంతోనే ఆగకుండా, శివ కుమారుడు వేణుమాధవ్‌కు హోంగార్డు ఉద్యోగం కల్పిస్తూ అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని ముఖ్యమంత్రి స్వయంగా అందజేశారు. సాహసోపేతమైన పనులతో నగర ప్రజల మన్ననలు పొందిన శివ కుటుంబానికి శాశ్వత ప్రాతిపదికన అండగా ఉండాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కొద్ది రోజుల క్రితమే శివ పరిస్థితిపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, తక్షణమే అతడికి అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు తీసుకున్న చర్యల అనంతరం, మంగళవారం జరిగిన భేటీలో శివకు మరిన్ని వరాలను ప్రకటించారు. శివ కుటుంబానికి ఒక డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చూపిన చొరవతో శివ కుటుంబంలో కొత్త వెలుగులు నిండాయి. ఇదే సందర్భంలో తన ఉపాధికి సంబంధించి శివ చేసిన విన్నపంపై కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ట్యాంక్‌బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇస్తే, దాని ద్వారా తన కుటుంబాన్ని పోషించుకుంటానని శివ కోరగా, ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న తమ కుటుంబాన్ని స్వయంగా ముఖ్యమంత్రి పిలిపించి మాట్లాడటమే కాకుండా, ఉద్యోగం, ఇల్లు, ఆర్థిక సాయం అందించడంపై శివ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. ముఖ్యమంత్రి గారి సహృదయానికి, సాయానికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఒక సామాన్యుడి సాహసాన్ని ప్రభుత్వం గుర్తించి గౌరవించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.



# మద్యం మత్తులో క్షణికావేశం





- భార్య, కుమారుడిని హత్య చేసిన భర్త
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

**రంగారెడ్డి,ఆమనగల్లు మహా :** ఆమనగల్లు మండల పరిధిలోని పులిగోనిపల్లి తాండలో మద్యం మత్తులో భర్త భార్య, కుమారుడి పై హత్య చేసిన దారుణ ఘటన చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే ఆమనగల్లు మండల పరిధిలోని పులిగోనిపల్లి తాండాకు చెందిన రాందాస్ నాయక్ ఆమనగల్లు కాటన్ మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య కవితతో కలిసి నలుగురు సంతానంతో జీవనం సాగిస్తున్నాడు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే రాందాస్ నాయక్ మద్యానికి బానిసై పెళ్లి అయినప్పటి నుంచి తరచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ కుటుంబ కలహాలు చివరకు విషాదానికి దారితీశాయి.మద్యం మత్తులో అదుపు కోల్పోయిన రాందాస్ నాయక్, భార్య కవిత (28) తో పాటు తన కుమారుడు హర్షిత్ (6) గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో భార్య, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. కూతురు ప్రణీత (8) తీవ్రంగా గాయపడగా, ఆమెను హైదరాబాద్ లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరు కుమార్తెలు సంఘటన సమయంలో అమ్మమ్మ ఇంట్లో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఏసీపీ జానకిరామ్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. మద్యానికి బానిసై తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించామని, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని ఆయన తెలిపారు.ఈ ఘటనతో పులిగోనిపల్లి తాండలో విషాద వాతావరణం నెలకొంది. ఒకే కుటుంబంలో జరిగిన ఈ దారుణ హత్యాకాండ స్థానికులను కలచివేసింది

# ఆదిలాబాద్ మున్సిపల్ లో బడ్జెట్ సమావేశం

## పట్టణ అభివృద్ధికి పెద్దపీట.. 158 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు

**ఆదిలాబాద్ మహా:** పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశంలో వారు పాల్గొన్నారు.202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తం రూ. 157.97 కోట్లతో అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేసారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాలపరిమితిని మరో ఏడాది పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రీన్ బడ్జెట్ కింద మున్సిపల్ చట్టం ప్రకారం 10% నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించి, వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ అనూష మాట్లాడుతూ, వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నల్లా పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బాసర క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

- గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు
- సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



**ఆదిలాబాద్ మహా:** బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు.ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత ఇస్తుంది



మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూత ఇస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, ఆర్ టి సి మంచిర్యాల డిపో మేనేజర్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి అనితలతో కలిసి ఎ పి ఎం లు, డి పి ఎం లు, స్వయం సహాయక సంఘాల మహిళలతో మహాలక్ష్మి పథకం అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ద్వారా రాష్ట్రంలోని మహిళలకు దాదాపు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి జరిగిందని వెల్లడించారు. ఇందిరమ్మ గృహ పథకంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ వారి పేరిట పథకం అమలు చేస్తున్నామని వివరించారు. అంతేకాకుండా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు.విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలలో దాదాపు 5 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రహరీ గోడ, వంటశాల, త్రాగునీరు, అదనపు గదులు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేయబడిన ఏకరూప దుస్తులను సకాలంలో విద్యార్థులకు అందించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా 16 బస్సులు వస్తున్నాయని చెప్పారు. ఆ బస్సులను ఆర్ టి సి సంస్థకు లీజ్ కి ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నట్లు వెల్లడించారు.జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టిన ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రాష్ట్రంలో ప్రథమంగా నిర్మాణం పూర్తి చేయబడి ప్రారంభానికి సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ భవన్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశాలు, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మహిళల సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని అన్నారు. మహిళను కుటుంబ పెద్దగా నిర్ధారించి అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులను మహిళల పేరిట జారీచేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని అన్నారు.

స్వయం సహాయక సంఘాలు అన్ని వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందే దిశగా బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జన్నారం మండలానికి చెందిన స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు వరలక్ష్మి, జైపూర్ మహాలక్ష్మి బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన లత లు మాట్లాడుతూ తాను గతంలో ఎక్కడికైనా వెళ్లాలి అంటే డబ్బుల గురించి ఇబ్బందులు పడాల్సి వచ్చేదని చెప్పారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కల్పించడం ద్వారా ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తూ వివిధ అవసరాలకు జిల్లా కేంద్రానికి, బంధువుల ఇండ్లకు వెళుతున్నామని వెల్లడించారు.ఈ ఉచిత బస్సు సౌకర్యం ద్వారా తనకు సంవత్సరానికి దాదాపు 40 వేల రూపాయలు ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా తాను ఇప్పటివరకు 20 వేల రూపాయల వరకు లబ్ధి పొందానని తెలిపారు. శుభకార్యాలకు, షాపింగ్ కు, దేవాలయాలకు, పిల్లల ఆసుపత్రులకు, బంధువుల కార్యక్రమాలకు వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతతో పాటు వివిధ వ్యాపార రంగాలలో అందిస్తున్న ప్రోత్సాహంతో వ్యాపార రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు

## ఆర్టీసీ బస్సులో 10 వేల కోట్ల చార్జీలు ఆదా చేశారు.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకంతో అద్భుత విజయానికి ప్రతీకగా ఆర్టీసీ బస్టాండ్ లలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9, 2023న ప్రారంభించిన మహాలక్ష్మి పథకం, (మార్చి 30, 2026) నేటి తో 10,000 కోట్ల రూపాయలు ఉచిత ప్రయాణాల మైలురాయిని విజయవంతంగాఅధిగమించిన సందర్భంగా శంషాబాద్ బస్ స్టాండ్ లో తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం దిగ్విజయంగా పదివేల కోట్లు మహిళ ఉచిత ప్రయాణానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. రాజేంద్రనగర్ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి తో కలిసిఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంషాబాద్ బస్టాండ్ లో రోజు ప్రయాణించే మహిళా ప్రయాణికులను శాలువాతో సత్కరించి రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సంబరాలు నిర్వహించారు. మహాలక్ష్మి పథకం విజయంతో ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులకు మహిళ ప్రయాణికులకు కేక్ కట్ చేసి తినిపించారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ నీలిమ, ఆఫీస్ సూపరింటెంట్ శేఖర్, కంట్రోలర్ సుదకర్, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు మహిళా ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలంలోని గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుంది.శంషాబాద్ మండలం చౌదర్ గూడా గ్రామ ప్రధాన రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను ఎంపీడీవో మున్ని, చౌదర్ గూడా గ్రామ సర్పంచ్ లక్ష్మీ లింగంతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం ప్రారంభించారు. సి,ఆర్,ఆర్ ఫండ్ తో మంజూరైన 29 లక్షల రూపాయలనిధులతో గ్రామపంచాయతీలోని ప్రధాన రహదారి వీధుల్లో సిసి రోడ్లను అత్యాధునిక ప్రమాణాలతో నిర్మాణం పూర్తయింది. వర్షాకాలంలో సిసి రోడ్లు లేక ఇబ్బంది పడ్డాం. సిసి రోడ్లు నిర్మాణం పూర్తి కావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మారుమూల ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే వరకు మా కృషి కొనసాగుతుంది. గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారంఎంతో అవసరమన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్, చంద్రారెడ్డి,దవణాకర్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్లు, వార్డు సభ్యులు, సుధాకర్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాలి వానకు పంటలు నష్టం

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి బలమైన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం అన్నదాతలకు నష్టం మిగిల్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మండలాలలో కురిసిన వర్షానికి వరి, జొన్న, మొక్క జొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు కోత కొచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. తలమడుగు మండల వ్యాప్తంగా వీచిన ఈదురు గాలులకు పలు పంటలు దెబ్బతిన్నాయి. వందలాది ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న నేలమట్టమైంది. నిర్మల్ తో పాటు పలు గ్రామాల్లో చేతికొచ్చిన మామిడి పంట పూర్తిగా నేలపాలయ్యింది. అలాగే మొక్కజొన్న, నువ్వు పంటలకు నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబెట్టిన పసుపుకొమ్ములు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. ఖానాపూర్, కడెం మండలాల్లో రాత్రి వీచిన ఈదురు గాలులకు రైతులకు భారీ నష్టం వాటిల్లింది. కోత కొచ్చిన మామిడి కాయలు గాలి వానకు నేల రాలాయి. చేతికొచ్చే మామిడి పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసారు. అధికారులు సర్వే నిర్వహించి నష్టపోయిన పంట వివరాల నివేదికలు తయారుచేసి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 8.9 కోట్లు విలువచేసే హైడ్రోపోనిక్ డ్రగ్స్ పట్టివేత..

## బ్యాంకాక్ నుంచి వస్తున్న ఇద్దరు ప్రయాణికులు అరెస్టు

**రాజేంద్రనగర్, మహా :** బ్యాంకాంగ్ నుంచి శంషాబాద్ ఎయిర్పోర్టు వస్తున్న ఇద్దరు ప్రయాణికుల వద్ద నుండి డిఆర్ఐ అధికారులు హైడ్రోపోనిక్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బ్యాంకింగ్ నుంచి శంషాబాద్ ఎయిర్పోర్ట్ వస్తున్న ఇద్దరు ప్రయాణికులపై అనుమానంతో వారి లగేజ్ ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా వారి లగేజీలో ఆకుపచ్చని ముద్ద రూపంలో 25.45 కిలోల హైడ్రోపోనిక్ డ్రగ్స్ ను డి ఆర్ ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 8.9. కోట్లు ఉంటుందని అధికారుల అంచనా. ఎన్ డి పి ఎస్ చట్టం 1985 నిబంధనల ప్రకారం అరెస్టు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

# ఏప్రిల్ 2 నుండి గ్రామ సభలు

- సభలలో ప్రభుత్వ పథకాల గురించి వివరించాలి
- 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఏప్రిల్, 2 నుండి నిర్వహించే గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులు, ఆర్డీఓలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు సభలు సమర్ధవంతంగా నిర్వహించాలని, పాఠశాల/పంచాయతీ భవన్/బహిరంగ ప్రదేశం/ ఏదైనా ఇతర అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు ప్రారంభించాలని, గ్రామ వార్డు సభలలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, గౌరవ మంత్రులకు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, సభలను రాష్ట్ర గీతంతో ప్రారంభించాలని, ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చదివి వినిపించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ అభివృద్ధి పథకాల పై చర్చించాలని, గ్రామ సభలలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు సంబంధిత శాఖల అధికారులు గ్రామ పెద్దలు స్వయం సహాయక సంఘాల సభ్యులు యువత రైతులు మహిళా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని సూచించారు. మహిళలు వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, ప్రదర్శన కోసం స్క్రీన్ మరియు ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలని, త్రాగునీరు, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభ బ్యానర్ ప్రదర్శించాలని సూచించారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, సిపిఓ సౌమ్య, సంక్షేమ శాఖల అధికారులు రామరావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషు రామ్, పద్మావతి, పిడి డీఆర్డీఏ శ్రీలత, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులను పంపిణి

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలంలొ పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ జడ్పిటిసి సభ్యులు ఆర్ సంతోష్ కుమార్ మంగళవారం నాడు పంపిణీ చేశారు.బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో వేమనపల్లి మండలంలోని ముల్కలపేట, నీల్వాయి,లక్ష్మీపూర్ గ్రామాలకుచెందిన నల్గురికి 1 లక్ష యాభై వేలరూపాయల విలువ సీఎం సహాయనిధి చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, డిసిసి జనరల్ సెక్రటరీ గాలి మధు, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య లతో కలిసి పంపిణి చేశారు.




# కేవీకే బెల్లంపల్లి ఆధ్వర్యంలో పంట మార్పిడిపైన అవగాహన సదస్సు

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మండలం కన్నాల రైతు వేదికలో మంగళవారం రోజు రైతులకు పంటల విభిన్నీకరణపై అవగాహన కార్యక్రమాన్ని కేవీకే బెల్లంపల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమ సమన్వయకర్త డా. ఎం. ప్రసూన రైతులకు పంటల మార్పిడి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా, వాతావరణ మార్పులు మరియు మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పలు పంటలను సాగు చేయడం ద్వారా రైతులు లాభాలను పెంచుకోవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా. ఎన్. మహేష్ జిల్లాలో పంటలమార్పిడి కి అనువైన ప్రత్యామ్నాయ పంటలు మరియు వాటి సాగు పద్ధతుల(ప్యాకేజ్ ఆఫ్ ప్రాక్టీసెస్)గురించిరైతులకు సమగ్రంగా వివరించారు. అదనంగా, డా. యు. శ్రావంతి ఆయిల్ పామ్ సాగులో అనుసరించాల్సిన నిర్వహణ పద్ధతులను వివరించి, రైతులు ఈ పంట ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పంట మార్పిడి పైన తమ అనుభవాలను పంచుకుంటూ, మార్కెటింగ్ సమస్యలు, విత్తనాల లభ్యత వంటి అంశాలను అధిగమిస్తే పంట మార్పిడి చేయొచ్చు అని తమ అభిప్రాయాలను తెలియజేశారు.ఈ అవగాహన కార్యక్రమం పట్ల రైతులకు పంటల విభిన్నీకరణపై స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు,ఆదాయాన్ని పెంచుకునేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ప్రేమ్ కుమార్,ఫర్హీన్,ఉద్యానవన శాఖ అధికారి అర్చన,వ్యవసాయ విస్తరణాధికారి తిరుపతి పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
సినిమా వార్తలు | MOVIE NEWS
బుధవారం, తిరుపతి | 01-04-2026

# సోషల్ మీడియా షేక్

టాలీవుడ్ లో యంగ్ హీరోయిన్స్ దూసుకుపోతున్నారు. కొత్త కొత్త బ్యూటీలు ఓవర్ నైట్ లో స్టార్ డమ్ తెచ్చుకుంటున్నారు వారిలో ఈ చిన్నది ఒకరు. రమ్య పసుపులేటి.. హుషారు సినిమాతో ఈ చిన్నది మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆతర్వాత కొన్ని సినిమాల్లో మెరిసింది. మొన్నామధ్య  మెయిన్ హీరోయిన్ గా మారుతి నగర్ సుబ్రహ్మణ్యం అనే అనే సినిమాలో మెరిసింది. అందం, అభినయంతో కుర్రాళ్లను కట్టిపడేసింది. ఇక ఇప్పుడు ఏకంగా చిరంజీవి సినిమాలో నటించే ఛాన్స్ అందుకుంది. విశ్వంభర సినిమాలో రమ్య మెగాస్టార్ చెల్లెలిగా కనిపించనుందని టాక్ వినిపిస్తుంది.చేసింది తక్కువ సినిమాలే కానీ విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది ఈ బ్యూటీ.. ఈ అమ్మడి ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.ఒక్కసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపించే అందం ఆమె సొంతం.. ఇప్పటికే కుర్రాళ్ళ గుండెల్లో గూడు కట్టుకుంది ఈ చిన్నది. సోషల్ మీడియాతో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. ఆతర్వాత సినిమాల్లో అవకాశాలు అందుకుంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.  Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034